# Interactive meeting with farmers for the management of Rugose Spiraling whitefly in Coconut and Palm trees at Rajahmundry (Andhra Pradesh)

## Need for Rugose Spiraling Whitefly Management

### తెల్లదోమను నివారించుకోవాలి

దేవరపల్లి, డిసెంబర్ 4: ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించి కొబ్బరి, పామాయిలు తోటలను ఆశించిన తెల్లదోమను నివారించుకోవాలని అంబాజీపేట కొబ్బరి పరిశోధనా సంస్థ చీఫ్ డాక్టర్ రామనాథ్, బెంగుళూరులో గల ఎంబిఎఈఆర్‌కు చెందిన కీటక శాస్త్రవేత్త డాక్టర్ సెల్వరాజ్ రైతులకు సూచించారు. దేవరపల్లిలో మంగళవారం కూచిపూడి బుల్లారావుకు చెందిన కొబ్బరితోటలో కొబ్బరి, పామాయిల్‌ను ఆశిస్తున్న తెల్లదోమ నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో శాస్త్రవేత్తలు రామనాథ్, సెల్వరాజ్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొబ్బరి, పామాయిలు తోటల్లో తెల్లదోమ ఎక్కువగా కనిపిస్తోందని, 2009లో అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో తెల్లదోమను గుర్తించడం జరిగిందని తెలిపారు. భారతదేశంలో కేరళ రాష్ట్రం ద్వారా 2016లో మొదటిసారిగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో గల కొబ్బరి, పామాయిల్ తోటలకు తెల్లదోమ సోకిందన్నారు. తెల్లదోమ సోకిన కొబ్బరి, పామాయిలు ఆకుల అడుగు భాగంలో తెల్లటి వలయాలు ఏర్పడతాయన్నారు. దూది వంటి తెల్లటి పదార్థం ఉంటుందన్నారు. ఈ తెల్లదోమ ఆకు రసాన్ని పీల్చివేసి తేనెలాంటి జిగురు పదార్థాన్ని విసర్జిస్తుందని తెలిపారు. దీనివల్ల ఆకులపై మసి ఏర్పడి కిరణజన్య సంయోగ క్రియ జరగదని, దానివల్ల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుందని, దీని నివారణకు ఉత్తమ యాజమాన్య పద్ధతులు చేపట్టాలని సూచించారు. పసుపురంగు కలిగిన జిగురు అట్టలను చెట్టు ఆకు కింది భాగంలో వేలాడదీయాలని, దీని ద్వారా తెల్లదోమ జిగురు అట్టకు అంటుకుంటుందన్నారు. పురుగు ఎక్కువగా ఉంటే ఆజాద్ డిరక్టిప్ 1000 పిపిఎం ఒక మిల్లీ లీటరు 10 గ్రాముల వేపనూనెలో కలిపి ఒక లీటరు నీటిలో కలిపి ఆకులపై పిచికారి చేయాలన్నారు. ఈవిధంగా దాదాపు 90 శాతం తెల్లదోమ నివారించ వచ్చని చెప్పారు. తెల్లదోమ నివారణకు రైతులకు అవగాహన మరింత కల్పిస్తామని సెల్వరాజ్, రామనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కొబ్బరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త చలపతి, పాపాయిల్ ఫ్యాక్టరీ డిజిఎం విజయప్రసాద్, ఉద్యానవన శాఖ ఎడిఎ బాలాజీ, ఉద్యాన అధికారి దేవదానం, రైతు నేతలు నరహరిశెట్టి రాజేంద్రబాబు, యాగంటి బుల్లబ్బాయి, పరిమి శ్రీరామకృష్ణ, జ్యేష్ఠ వెంకటేశ్వరరావు, కరుటూరి శ్రీనివాస్, ఉండవల్లి సుభాష్‌చంద్రబోస్, నందిన రామకృష్ణ, పలువురు పామాయిలు, కొబ్బరి రైతులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రామనాథ్

## Rugose Spiraling Whitefly in Oil Plam

### కేరళ నుంచి పశ్చిమకు తెల్లదోమ

» అంబాజీపేట ఉద్యాన వన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త

**దేవరపల్లి/నల్లజర్ల, డిసెంబరు 4 :** ఆయిల్ తోటల్లో తెల్లదోమ వ్యాప్తిని అరికట్టేందుకు ఎటువంటి పురుగు మందులు వాడవద్దని తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేట ఉద్యాన వన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త ఎన్‌వీవీ చలపతిరావు రైతులకు సూచించారు. దేవర పల్లి, యాదవోలు రహదారిలో ఉన్న ఆయిల్ పామ్ తోటలను శాస్త్రవేత్తల బృందం మంగళవారం పరిశీలించింది. అనంతరం 3ఎఫ్ ఆయిల్ పామ్ ఆగ్రోటెక్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నల్లజర్ల, దేవరపల్లి మండలాల ఆయిల్ పామ్ రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పోర్చుగల్ దేశానికి సంబంధించిన తెల్లదోమ భారతదేశంలో కేరళ రాష్ట్రంలో కొబ్బరి తోటలకు వ్యాపించిందని, అనంతరం పశ్చిమ గోదావరి జిల్లాలో కొబ్బరి తోటల ద్వారా ఆయిల్ పామ్ తోటలకు వ్యాపించిందని తెలిపారు. తక్కువ ఖర్చుతో తెల్లదోమను నివారించవచ్చని ఆయిల్ పామ్ చెట్లకు పసుపు రంగు స్టిక్కర్లను అంటించడం కానీ, వేప నూనె స్ప్రే చేయడం ద్వారా గానీ దీన్ని నివారించవచ్చని తెలిపారు. నీటిని పిచికారీ చేయడం ద్వారా తెల్లదోమ వ్యాప్తి తగ్గిపోతుందన్నారు. తెల్లదోమ ఉధృతి వల్ల ఆయిల్ పామ్ దిగుబడి తగ్గి పోతుందని రైతులు సకాలంలో స్పందించాలని కోరారు. దేవరపల్లి ఉద్యాన శాఖాధికారి దేవదానం, రామానందం, బెంగళూరుకు చెందిన ఎన్‌వీఏఆర్ కీటక పరిశోధన సంస్థ శాస్త్రవేత్త సెల్వరాజు, విజయనగర్ కొబ్బరి బోర్డు డైరెక్టర్ జయంత్, 3ఎఫ్ ప్రతినిధి విజయ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఉద్యాన వన కేంద్ర శాస్త్రవేత్త

Awareness Program on Rugose Spiraling Whitefly Management

# తెల్లదోమ నివారణకు అవగాహనా కార్యక్రమాలు

**ఏలూరు ప్రభ న్యూస్: ప్రతినిధి** 3ఎఫ్ ఆయిల్ పామ్ అగ్రో టెక్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు పశ్చిమగోదావరి జిల్లా ఉద్యానశాఖ వారి అధ్వర్యంలో మంగళవారం నల్లజర్ల మరియు దేవరపల్లిలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమాలలో ఆయిల్ పామ్ సాగు లో మెళకువలు మరియు రైతులకు కొరకరాని కొయ్యలా మారిన తెల్లదోమ పురుగు నివారణ గురించి శాస్త్రవేత్తలు వివరంగా చెప్పడమే కాకుండా ప్రదర్శన ద్వారా చూపించారు. ఎల్లో స్టిక్కీ పాడ్ లను ఉపయోగించాలి అని వేప నూనె స్ప్రే చేయడం ద్వారా తెల్ల దోమ ఉద్ధృతి తగ్గించవచ్చని చెప్పినారు.పోర్చుగల్ దేశానికి చెందిన తెల్లదోమ కీటకం కేరళ నుండి పశ్చిమ గోదావరి జిల్లాలోని కొబ్బరితోటలకి దాని నుండి పామ్ ఆయిల్ తోటలకి విస్తరించింది జిల్లాలోని 9 మండలాలలో గల పామ్ ఆయిల్ తోటల లో దీనిని గుర్తించిన 3 ఎఫ్ ఆయిల్ అగ్రోటెక్ వారు రైతులకి ధైర్యం చెప్పి వివిధ విభాగాలకు చెందిన వారితో ఈ అవగాహనా కార్యక్రమం రైతుల శ్రేయస్సు కొరకు ఏర్పాటు చేయడం జరిగిది.తక్కువ ఖర్చుతోనే తెల్లదోమ నిర్మూలించడానికి ఉపయోగించే ఫంగస్ ను ఏవిధంగా రైతులే తయారు చేసుకోవలో వివరించడం జరిగింది.ఈ కార్యక్రమానికి 250 మంది పామ్ ఆయిల్ రైతులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ బి వి చలపతి రావు , డాక్టర్ రామానందం , బెంగళూర్ ఎన్ బి ఎ ఐ ఆర్ నుండి కీటక పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ కె సెల్వరాజ్ , విజయనగరం నుండి జాతీయ కొబ్బరి బోర్డ్ డైరెక్టర్ జయంత్ 3 ఎఫ్ ఆయిల్ అగ్రో టెక్ నుండి విజయ ప్రసాద్ మరియు ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.



: రైతులకి పలు సలహాలు మరియు సూచనలు అందించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు ఉద్యాన శాఖ అధికారులు

Management of Rugose Spiraling Whitefly through natural enemies

# మిత్ర పురుగుల ద్వారా తెల్లదోమ నివారణ

**దేవరపల్లి, న్యూస్‌టుడే:** మిత్ర పురుగులను వృద్ధి చేసుకోవడం ద్వారా తెల్లదోమను నివారించుకోవచ్చని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. దేవరపల్లిలో కూచిపూడి బుల్లారావుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన రైతు సదస్సుకు అంబాజీపేటలోని కొబ్బరి పరిశోధనా కేంద్రం ముఖ్యశాస్త్రవేత్త డాక్టర్ రామనాథం, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ చలపతి, బెంగళూరు నుంచి వచ్చిన మరోశాస్త్రవేత్త డాక్టర్ సెల్వరాజ్ హాజరయ్యారు. ఫ్లోరిడా నుంచి వలస వచ్చిన సర్పిలాకార తెల్లదోమ క్రమంగా వృద్ధి చెందుతోందన్నారు. దీని నివారణకు జీవనియంత్రణ పద్ధతులే శరణ్యమని చెప్పారు. తెల్లదోమలను అరికట్టడంతో పాటు, పంటలకు మేలుచేసే బదనికలను ఎక్కువ సంఖ్యలో అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. తెల్లదోమ నివారణకు పురుగు మందులను పిచికారీ చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని స్పష్టం చేశారు. జీవ నియంత్రణ పద్ధతులు పాటిస్తే దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరతాయన్నారు. పసుపు ఎరలను వినియోగించడం, వేపనూనె, నీళ్లను పిచికారీ చేయడం ద్వారా తెల్లదోమను కొంతమేర నివారించొచ్చన్నారు. ఉద్యానశాఖ సహాయసంచాలకుడు బాలాజీకుమార్, త్రిబుల్‌ఎఫ్ ఆయిల్‌పామ్ సంస్థ డీజీఎం విజయప్రసాద్, మండల ఉద్యానఅధికారి ఎ.దేవదానం, వ్యవసాయాధికారి నున్న కృష్ణకిషోర్, వ్యవసాయశాఖ విశ్రాంత సహాయసంచాలకుడు కేశిరాజు సీతారామయ్య వేదికపై ఉన్నారు. సదస్సు అనంతరం తెల్లదోమలను అరికట్టే విధానాల గురించి రైతులకు శాస్త్రవేత్తలు సోదాహరణంగా వివరించారు. రైతులు సానుకూల దృక్పథంతో ప్రయత్నాలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. లేకుంటే రాబోయే రోజుల్లో తెల్లదోమ మరింత ఉద్ధృతమయ్యే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రామనాథం

# సమగ్ర సస్యరక్షణ ద్వారా తెల్లదోమను నివారించుకోవాలి

## రైతులకు కొబ్బరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తల సూచన





దేవరపల్లిలో పంట తోటలు సాగు చేసే రైతుల అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న కొబ్బరి పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త జి. రామానందం, సదస్సుకు హాజరైన రైతులు

**దేవరపల్లి:** సమగ్ర సస్యరక్షణ ద్వారా పంట తోటలను ఆశించిన సర్పిలాకార తెల్లదోమను నివారించుకోవాలని అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ జి. రామానందం రైతులకు సూచించారు. ఉద్యానవన శాఖ, 3ఎఫ్ ఆయిల్ పామ్ సంస్థ సంయుక్తంగా దేవరపల్లిలో మంగళవారం సాయంత్రం జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా కొబ్బరి, ఆయిల్‌పామ్‌ను ఆశించే సర్పిలాకార తెల్లదోమ నివారణపై రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ రామానందం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు విజయనగరం జిల్లాలో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో సర్పిలాకార తెల్లదోమ ఎక్కువగా ఉందన్నారు. 2016 డిసెంబర్‌లో తెల్లదోమను తూర్పుగోదావరి జిల్లా కడియంలో గుర్తించినట్టు ఆయన తెలిపారు. ఏడాది క్రితం పశ్చిమగోదావరి జిల్లా కలవలపల్లిలో గుర్తించినట్టు ఆయన వివరించారు. తెల్లదోమ 200 రకాల మొక్కలకు వ్యాపిస్తుందన్నారు. కొబ్బరి, ఆయిల్‌పామ్, సీతాఫలం తోటల్లో ఎక్కువగా ఉందని ఆయన తెలిపారు. అయితే నివారణకు పురుగుమందులు వాడవద్దని, జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా తెల్లదోమను నివారించుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఈ పద్ధతి ద్వారా దోమ నెమ్మదిగా తగ్గుతుందని ఆయన తెలిపారు. ప్రకృతికి హాని కలగకుండా ఉంటుందన్నారు. దోమను నివారించే పురుగు పాసిల్ మైసిస్ ఫ్యూమో సోరియాసిస్(ఫంగల్) బూజు జాతి సిలీంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. సిలీంద్రాన్ని బెంగుళూరు పరిశోధనా కేంద్రం నుంచి తీసుకువచ్చి పరిశోధనలు చేసి అభివృద్ధి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. బెంగుళూరు పరిశోధనా కేంద్రం నుంచి వంగ, ఆక పురుగులను తీసుకువచ్చి అభివృద్ధి చేయగా ఇప్పటివరకు 1,350 సిలీంద్రాలు తయారైనట్టు ఆయన తెలిపారు. దాదాపు 50 వేల సిలీంద్రాలు తయారు అయిన తర్వాత తోటల్లోకి విడిచిపెడతామని, దీని ఫలితాలను గమనించిన తర్వాత ఎక్కువ మొత్తంలో అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. మేలు చేసే పురుగులను కాపాడుకోవాలని ఆయన రైతులకు సూచించారు. కొబ్బరి పరిశోధనా కేంద్రం కీటక విభాగం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త వి.వి. చలపతిరావు మాట్లాడుతూ కొబ్బరి, ఆయిల్‌పామ్ ఆకుల అడుగు భాగాన తెల్లదోమ చేరి గుడ్లు పెడుతుందన్నారు. ఒకరోజుకు దోమ లక్ష పిల్లలను పెడుతుందని ఆయన తెలిపారు. కొబ్బరి చెట్లకు పసుపు రంగు జిగురు అట్టలు కట్టాలన్నారు. జామ తోటలు ఉన్న ప్రదేశంలో తెల్లదోమ ఎక్కువగా వ్యాపిస్తుందన్నారు. దోమ నివారణకు వేపనూనె, వేపాకు రసం పిచికారీ చేయాలని ఆయన రైతులకు సూచించారు. వీటితో పాటు సర్ఫ్ కలపాలని ఆయన తెలిపారు. ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి. బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో దేవరపల్లి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, చాగల్లు మండలాల్లో తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. జిల్లాలో 32 వేల హెక్టార్లలో కొబ్బరి, 80 వేల హెక్టార్లలో ఆయిల్ పామ్ తోటలు ఉన్నాయని ఆయన తెలిపారు. 25 శాతం తోటలకు తెల్లదోమ వ్యాపించినట్టు ఆయన వివరించారు. దోమ సోకిన తోటల్లో బదనికలు అభివృద్ధి చేసుకోవాలని, నీటిని వేగంగా పిచికారీ చేయాలని ఆయన సూచించారు. ఉద్యాన శాఖ ద్వారా టర్బో స్ప్రేయర్లు సరఫరా చేయడానికి ఆలోచన చేస్తున్నట్టు ఆయన తెలిపారు. బెంగుళూరు కొబ్బరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త కె. సెల్వరాజ్ మాట్లాడుతూ తెల్లదోమ నాలుగు దశల్లో ఉంటుందన్నారు. నివారణకు పురుగు మందులు వాడవద్దని ఆయన సూచించారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో తెల్లదోమ ఉధృతి తగ్గలేదని ఆయన వివరించారు. విర్నాయగూడెం సొసైటీ అధ్యక్షులు మార్ని సూర్యచంద్రరావు మాట్లాడుతూ సదస్సుల వల్ల రైతులకు ప్రయోజనం లేదన్నారు. రెండేళ్లుగా ఉభయగోదావరి జిల్లాల్లో తెల్లదోమ వ్యాపించిందని, ఇప్పటివరకు శాస్త్రవేత్తలు, అధికారులు నివారణ చర్యలు ఎందుకు గుర్తించలేదని ఆయన ప్రశ్నించారు. తెల్లదోమ వల్ల తోటలు మాడి మసై పోతున్నాయని ఆయన వివరించారు. రైతులకు అవసరమైన సూచనలు, సలహాలను పుస్తక రూపంలో అందజేయాలని ఆయన కోరారు. రైతులు మాట్లాడుతూ తెల్లదోమ తోటలను విడిచి ఇళ్లల్లోకి వస్తున్నాయన్నారు. సాయంత్రం 4 గంటలకు తెల్లదోమ గ్రామాల్లోకి వస్తున్నాయని రైతులు వివరించారు. అనంతరం రైతు కాకర్లపూడి బుల్లియ్య ఆయిల్‌పామ్ తోటలో ఫంగస్(సిలీంద్రాన్ని)ను డెమో చేసి రైతులకు అవగాహన కల్పించారు. సదస్సులో విశ్రాంత ఏడీఏ అరుట జగన్నాధరావు, మండల ఉద్యాన శాఖ అధికారి ఎ. దేవదానం, 3ఎఫ్ ఆయిల్‌పామ్ సంస్థ డీజీఎం విజయప్రసాద్, రైతులు పాల్గొన్నారు.